
# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

# THE WORD OF TRUTH



MARCH 1995

# సంక్షిప్త వార్తలు

ఫిబ్రవరి 5వ తేదీ ఆదివారం అమెరికానుండి వచ్చిన సోదరీలు ఫ్లీటాడిసెల్, మరియు రీటాపెర్కిన్స్ కాకినాడ రామారావుపేట క్రీస్తు సంఘ ఆరాధనలో పాల్గొనిరి. తదనంతరం జరిగిన స్త్రీల కూటములో ఆ యిద్దరు సహోదరీలు మంచి బైబిలు పాఠముల నుపదేశించిరి. అదే రోజు సాయంత్రం 4-30 గంటలకు కందరాడ క్రీస్తు సంఘమును కూడ వారు దర్శించి క్రైస్తవ స్త్రీలను హెచ్చరించిరి. ఆ సందర్భముగా ఏర్పాటు చేయబడిన సువార్త కూటములో సోదరులు చుక్కా అప్పారావ్‌గారు ఉపన్యసించిరి. కూటము అనంతరం 14 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కందరాడ గ్రామములో సోదరులు R. ప్రకాశ్ రెడ్డిగారు క్రీస్తుకొరకు మంచి పరిచర్య చేయుచున్నారు.

ఫిబ్రవరి 7వ తేదీన ఖమ్మం జిల్లా మణుగూరులో క్రీస్తు సంఘస్థులు నిర్మించిన ప్రార్థన షెడ్‌ను సోదరులు జాషువాగారు రిబ్బను కత్తిరించి తెరచిరి. ఆసందర్భముగా ఏర్పాటు చేయబడిన సువార్త కూటములలో జాషువాగారు, చుక్కా అప్పారావుగారు, ఇందుపల్లి ఇశ్రాయేలుగారు తదితరులు వాక్యపరిచర్య చేసిరి. ఆ రోజు మణుగూరులో క్రీస్తులోనికి పదిమంది బాప్తిస్మము పొందిరి. మణుగూరు ప్రాంతములో Bro. సురేంద్రకుమార్‌గారు సువార్త చాటుచున్నారు.

ఫిబ్రవరి 8వ తేదీన ఖమ్మం పట్టణంలో ఏర్పాటు చేయబడిన సువార్త కూటములో చుక్కా అప్పారావుగారు, జాషువాగారు, ఇందుపల్లి ఇశ్రాయేలుగారు, T. ప్రసాదరావుగారు దినమంతయు పాల్గొనిరి. చుక్కా అప్పారావుగారు గంభీరోపన్యాసముల నిచ్చిరి. ఆ సాయంత్రం ఖమ్మంలో నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఖమ్మంలో Bro. B. ఆనందరావుగారు మంచి పనిచేయుచున్నారు.

[తరువాయి టైటిల్ 3వ పేజీలో

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, .A.P. 533 001

Phone ; 0884-73722

Editor ; J.C. CHOATE

Managing Editor JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 15 | మార్చి 1995 | సంచిక 8


## సంపాదకీయం

### దేవుని సంతోషపెట్టునది

### (What Pleases God)

దేవుని కిష్టమైన దేమిటో తెలిసికొనుటకు మనలో ప్రతివాడు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఏలయనగా దేవుడు ఈ లోకమును దాని లోని సమస్తమును సృజించినవాడు గదా. ఆయన సృష్టిలో మానవుడు కూడ ఒక భాగమై యున్నాడు. మనమాయన సంతానము గనుక ఆయన దృష్టికేది యిష్టమో తెలిసికొనుట మన విధియైయున్నది. 1 కొరింథీ 1:21లో ఈలాగు వ్రాయబడి యున్నది : "దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానముచేత దేవునిని ఎరుగకుండినందున, సువార్త ప్రకటన యను వెర్రితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను".

నేటి కాలములో సువార్త ప్రకటన అంటే కొందరికి యిష్టము

కాకపోవచ్చును. అయితే అది విచారము; ఏలయనగా సువార్త ప్రకటన ద్వారానే దేవుడు మానవులను రక్షించుటకు ఇచ్ఛయించారు. మానవులను రక్షించడానికి అవుసరమైతే దేవుడు పలు మార్గముల నుపయోగింపగలడు, గాని సువార్త ప్రకటన ద్వారానే నశించుచున్న మానవులను రక్షించుటకు ఆయన ఎంచుకొనెను. అందువలన ఒకనికి యిష్టమైనను యిష్టముకాకపోయినను సువార్త ప్రకటింపబడవలసినదే.

సువార్తద్వారా ఈ లోకమును రక్షించు విధానమును దేవుడే ర్పరచుకొని నప్పుడు, ఆ వర్తమానమును గూర్చిన వివరములను ఆయన సవిస్తరముగా వివరించెను. యేసుప్రభువు మృతులలోనుండి పునరుత్థానుడైన తరువాత తాను ఏర్పరచుకొనిన అపొస్తలులకు ఈ వర్తమానము నిచ్చెను: "పరలోక మందును, భూమి మీదను నాకు సర్వాధికార మీయబడి యున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:18-20).

అపొస్తలులు మూడు సంవత్సరములకు పైగా ప్రభువుయొద్ద శిక్షణ పొందినవారే అయితే ప్రభువు వారికేమి బోధించెనో వాటన్నిటిని వారు తిరిగి యితరులకు బోధించాలని ఆజ్ఞాపింపబడిరి. ఇది చాల గొప్ప పని. అయితే వారికి పైనుండి సహాయము వచ్చునని తెలుప బడెను. "ఆదరణకర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశు ద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతు లన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" అని ప్రభువు వారితో చెప్పెను

(యోహాను 14:26). దీనిని బట్టి అపొస్తలులు పొరబడకుండా సువార్త వాక్యము నెట్లు బోధించిరో మనము తెలిసికొనగలము. పరిశుద్ధాత్మ ద్వారా వారికి దైవిక సహాయము అందియ్యబడెను.

దైవాధికారము బడసినది తప్ప వేరొక దానిని బోధించుటను బైబిలు ఖండించుచున్నది. సరిగదా అందునుగూర్చి దైవ గ్రంథము అనేక హెచ్చరికలు చేయుచున్నది. "మేము మీకు ప్రకటించిన సువార్త గాక మరియొక సువార్తను మేమైనను పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవునుగాక, మే మిదివరకు చెప్పిన ప్రకార మిప్పుడును మరల చెప్పుచున్నాము; మీరు అంగీకరించిన సువార్త గాక మరి యొకటి ఎవడైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్తుడవును గాక" (గలతీ 1:8-9).

"సహోదరులారా, నేను ప్రకటించిన సువార్త మనుష్యుని యోచన ప్రకారమైనది కాదని మీకు తెలియచెప్పుచున్నాను. మనుష్యుని వలన నేను దానిని పొందలేదు. నా కెవడును దానిని బోధింపనులేదు గాని యేసుక్రీస్తు బయలుపరచుట వలననే అది నాకు లభించినది" అని అపొ. పౌలు మరల చెప్పుచున్నాడు (గలతీ 1:11, 12). ఏమి బోధింపబడాలో ఈ లేఖనభాగములు అనుమానము లేకుండ మనకు తెలియజేయుచున్నవి. సువార్త, క్రీస్తు సువార్త మాత్రమే మానవుని రక్షించును. మానవుల సిద్ధాంతములను, బోధలను ఒక ప్రక్కన పడేసి, క్రీస్తు సువార్తలోని రక్షణ శక్తిని అందరు బోధించాలి. యిది అత్యవసరము. గత కాలమంతటిలో మానవులు అనేక బోధలను సిద్ధాంతములను కలిపి క్రీస్తు సువార్తను భయంకరంగా మార్చి వేసారు. అయితే దేవుడిచ్చిన హెచ్చరికలు ఈనాటికిని నిలిచేయున్నవి. మానవకల్పిత సిద్ధాంతములను బోధించు వారందరు శాపగ్రస్తులు!

"ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్ళి యున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి". వాటిని పరీక్షించే సమయ మిదే! (1 యోహాను 4:1).

— o —

కొండమీద ప్రసంగము - 12

## పరలోక రాజ్యములో ప్రవేశించుటకు అధికమైన నీతి అవసరం

## (Exceeding Righteousness Necessary to Enter the Kingdom of Heaven)

(మత్తయి 5 : 20)

యేసు కొండమీదనుండి ప్రసంగము చేస్తూ మత్తయి 5:20 లో "శాస్త్రుల నీతి కంటెను, పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కానియెడల మీరు పరలోక రాజ్యములో ప్రవేశింపనేరరని మీతో చెప్పుచున్నాను" అని చెప్పెను. మత్తయి వ్రాసిన సువార్తయొక్క ప్రాముఖ్యాంశము యిది, శాస్త్రులయొక్కయు పరిసయ్యులయొక్కయు స్వనీతిని మించిన నీతి, లేదా దానికి భిన్నమైన దేవుని నీతిని గూర్చి ఇక్కడ చెప్పబడియున్నది. యిది దేవుడు కోరునట్టి నీతి. యేసుప్రభువు ఈ అధికమైన నీతిని ఎట్లు తన జీవితంలో చూపించారో మత్తయి మనకు తెలియ చేయుచున్నాడు.

నీతి అవుసరమని పాతనిబంధన సూచిస్తు వచ్చింది గాని దానిని మానవుని కియ్యలేకపోయింది. "నేను దేవుని కృపను నిరర్థకము చేయను; నీతి ధర్మశాస్త్రము వలనైతే ఆ పక్షమందు క్రీస్తు చని పోయినది వ్యర్థమే" అని అపొ. పౌలు అనుచున్నాడు (గలతీ 2:21). యేసుప్రభువు తన ప్రజలను వారి పాపములనుండి రక్షించడానికి

వచ్చాడు (మత్తయి 1:21). అంటే వారిని నీతిమంతులునుగా చేయుటకు వచ్చాడు. ఆయన కొండమీద చేసిన ప్రసంగ సారాంశమంతా దేవుడు కోరునట్టి అధికమగు నీతిని గూర్చియే యున్నది.

ఈ అధికమగు నీతి మత్తయి నాలుగవ అధ్యాయంలో క్రీస్తు పొందిన శోధనలలో పరిచయం చేయబడింది (మత్తయి 4 అధ్యా). ఆయన మానవ ప్రతినిధిగా ఇక్కడయున్నాడు. రాళ్ళను రొట్టెలుగా ఆజ్ఞాపించమని అపవాది ఆయనను శోధించగా, "మనుష్యుడు రొట్టె వలన మాత్రము కాదుగాని దేవుని నోటినుండి వచ్చు ప్రతి మాట వలన జీవించును" అని జవాబిచ్చెను (మత్తయి 4:4). దేవుడు కోరునట్టి నీతి, ఆయన చిత్తానికి భిన్నంగా ప్రవర్తించి శారీరక అవుసరాలను తీర్చుకొనదు. ఆకలి తీరుటకు రొట్టెలు తినుటలో తప్పులేదుగాని, దేవుని చిత్తాన్ని, వాక్యాన్ని ఉల్లంఘించి ఆపని చేయరాదు. నిజమే, క్రైస్తవులైన అనేకులు ఈ లోకాశలకులోనై తమ దేవునినే మరచియున్నారు. ఆత్మీయ మానవుడు దేవుని వాక్యాన్నిబట్టి జీవించాలి, జీవిస్తాడు.

## దేవునికే మహిమ

"ప్రభువైన నీ దేవుని శోధింపవలదని" అపవాదికి మరింకొక శోధనలో యేసుప్రభువు జవాబిస్తు, దేవుడు కోరు అధికమైన నీతిని గూర్చి వక్కాణించాడు. ఆయన అపవాది కోరినట్లు దేవాలయ శిఖరమునుండి క్రిందికి దుమికితే, చాలమంది జనం చూస్తారు. గొప్ప ప్రచారం జరుగుతాది. నిజమే, గాని ఎవరికి? అపవాదికి!! దేవుని మహిమ పర్చడానికి, దేవునిచే ఆయన మహిమ పరచబడడానికి క్రీస్తు ఈ లోకమునకు వచ్చెను (యోహాను 17:4-5). ఈ అధికమైన నీతి ఎల్లప్పుడు దేవుని మహిమనే కాంక్షిస్తాది. మన ప్రధాన సమస్య యేమంటే మనకు మనమే ఈ మహిమను సంపాదించుకోవాలని అను

కొంటాము. పరలోక రాజ్యము లేక క్రీస్తు సంఘము దేవుని ఘనతకే గాని నీయొక్కయు, నాయొక్కయు ఘనతకొరకు స్థాపించబడలేదు. "క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక, ఆమేన్" (ఎఫెసీ 3:21). మన స్వనీతిని గాక దేవుని నీతిని స్థాపింపబూనుకొనిన యెడల నేటి సంఘాల్లో యున్న బోధకుల సమస్యలు, సభ్యుల సమస్యలు, సంఘ రాజకీయాలు క్షీణించి పోతాయి. నీవు సాగిలపడి నాకు నమస్కారము చేయుమని అపవాది క్రీస్తుతో అనగా, "సాతానా పొమ్ము ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని వ్రాయబడి యున్నదని" ఆయన వానిని గద్దించెను (మత్త 4:10). అపవాదిని ఇట్లు గద్దించుటలో తండ్రియైన దేవునికి ఆయన అత్యంత విధేయత చూపించెను. మన ఆరాధనామూర్తి దేవుడే గాని, అపవాది కాకూడదు.

## స్వనీతి కాదు

శాస్త్రిల నీతి కంటెను పరిసయ్యుల నీతికంటెను మన నీతి అధికము కానియెడల పరలోక -రాజ్యములో ప్రవేశింపలేమని యేసు ప్రభువు పలికెను. ఆయన అనేక ధన్యతలను గూర్చి ఉపదేశించెను. అవన్నియు అధికమైన నీతిని గూర్చి వక్కాణించుచున్న సూత్రములే. ఆత్మవిషయమై దీనులైనవారు, వారి దీనస్థితిని గుర్తించినవారు. వారు స్వనీతిపరులు కారు. వారు తమ పాపపు స్థితిని గూర్చి దుఃఖించిన వారు. దేవుని పరిశుద్ధతను, పాపపు దుస్థితిని వారు ఎరిగినవారు. యితరుల యెడల సాత్వీక స్వభావమును వారు కలిగియుంటారు. సాత్వీకులు అంటే బలహీనులు కారు గాని పరుల ఆత్మల యెడల ఆసక్తి కలిగిన వారు. నీతికొరకు ఆకలిదప్పులు వారు కలిగియుంటారు. దేవుని నీతి యొక్క విలువను వారెరిగినవారు. దేవునిలో మాత్రమే మానవుని ఆత్మీయ ఆకలి దప్పులు తృప్తిపరచబడునని వారెరుగుదురు. అట్టివారు

కనికరము చూపుదురు, పరిచర్య చేసే తరుణమును వారు పోగొట్టుకొనరు. దేవుని కనికరము వారికే అవుసరమని యెరిగి యితరుల యెడల కనికరము కలిగియుంటారు. ఈ అధికమైన నీతి జీవిత కేంద్రమైన హృదయంలో ఆరంభిస్తాది. వారి హృదయం శుద్ధమైనది. కపటం కల్మషం లేనివారు. మోసగించు హృదయం వారికుండదు. అట్టివారు స్వార్థప్రియులుకారు. మానవసమస్య లన్నిటికి దేవుని నీతిలో పరిష్కారమున్నదని వారెరుగుదురు. అందువలన నీతిని సమాధానాన్ని వారు వెంటాడుతారు.

యేసుప్రభువు కోరుచున్న ఈ అధికమైన నీతి చాల ఖరీదైనది. దాని వెంటాడువారు తాము ఎంతైనా త్యాగం చేయవలసి వస్తాది. హింసలను, మరణాన్ని సయితం అది వహిస్తాది. యేసుప్రభువు తన జీవితంలో దీనినంతటిని సహించాడు. పాతనిబంధనలోని ప్రవక్తలు ఈ అధిక నీతికొరకు హింసింపబడ్డారు. అపొస్తలులు, మొదటి శతాబ్దపు క్రైస్తవులు కొరడాలతో కొట్టబడ్డారు. చెరసాలలో వేయబడ్డారు, రంపములతో కోయబడ్డారు, శిరచ్ఛేదనము చేయబడ్డారు, సిలువ వేయబడ్డారు, ఘోరంగా చంపబడ్డారు. వారు శాస్త్రిల పరిసయ్యుల నీతికంటె దేవుని నీతిని కాంక్షించారు. దైవనీతిని కోరేవారు లోకమునకు ఉప్పయి యున్నారు. వారు లోకమునకు వెలుగై యున్నారు. అందువలన ఈ అధికమైన నీతి మరుగుచేయబడదు. కొండమీదనుండు పట్టణమువలెను, దీపస్థంభము మీదనున్న దీపమువలెను అది మరుగై యుండదు, అందరికీ వెలుగిచ్చుచునే యుంటాది.

## ప్రతీకారము చేయుదు

పరిసయ్యుల నీతికంటె అధికమైన నీతి దెబ్బకు దెబ్బ కొట్టదు. పగతీర్చుకొనదు. అది యితరుల బలహీనతలను అర్థము చేసుకొంటాది (మత్త 5:21-26). అది వివాహముయొక్క పరిశుద్ధతను కాపాడుకొం

టాది. "వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా; నేను మీతో చెప్పునదేమనగా ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును" అని యేసుప్రభువు చెప్పారు (మత్తయి 5:27-23). అది వ్యభిచార సంబంధమైన తలంపులు ఉద్భవించకుండా హృదయాన్ని కాపాడుకొంటాది.

పరిసయ్యుల నీతికంటె అధికమైన నీతి పాపమును తీవ్రముగా ఎంచుతాది. దాన్ని నవ్వులాటగా పరిగణించదు. కంటివ్యాధితో ఒకడు డాక్టరు దగ్గరకు వెళ్ళితే, ఒక కన్ను పెరికివేయాలని డాక్టరు చెబితే అతడు నవ్వుతు బయటకు రాడుగదా! నీ దేహమంతయు నరకములో పడవేయబడకుండ నీ అవయవములలో ఒకటి నశించుట నీకు ప్రయోజనముగదా (మత్తయి 5:30). అధికమైన నీతియొక్క మాట అవునంటే అవును, కాదంటే కాదు అని యుంటాది. ఈ నీతి గలవాడు తానిచ్చిన మాటను చులకనగా ఎంచడు, తానిచ్చిన వాగ్దానములను నెరవేరుస్తాడు (మత్తయి 5:37).

పరిసయ్యుల నీతికంటె అధికమైన నీతి ఉదారస్వభావము గలది. "నిన్ను అడుగువానికిమ్ము నిన్ను అప్పు అడుగగోరువానినుండి నీ ముఖము త్రిప్పుకొనవద్దు" (మత్తయి 5:42). అది ఎల్లవేళలా మేలు చేయుటకే ప్రయత్నించును. అది మానవుని మెప్పుకంటె దేవుని మెప్పును కోరతాది. మానవుడు పై వేషాన్ని చూస్తాడు గాని దేవుడు హృదయాన్ని చూస్తాడు. గనుక తన దాతృత్వాన్ని అది మనుష్యులకు కనబడవలెనని యేమీ చేయదు (మత్త 6:1-4).

పరిసయ్యుల నీతికంటె అధికమైన నీతి దేవునితో సహవాసాన్ని కోరతాది, ప్రార్థనద్వారా ఈ సహవాసాన్ని కొనసాగిస్తాది. (మత్తయి 6:5-13). "దేవా నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసి

గొనుము. నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము. నీకాయాసకరమైన మార్గము నాయందున్న దేమో చూడుము. నిత్యమార్గమున నన్ను నడిపింపుము" అని అది ప్రార్థిస్తాది (దా. కీర్త 139:23-24). అది దేవుని నామాన్ని గూర్చి, ఆయన రాజ్యాన్ని గూర్చి ఆయన చిత్తం ఈ లోకంలో నెరవేరుటను గూర్చి ఆసక్తి కలిగియుంటాది. తాను క్షమింపబడినది గనుక యితరులను క్షమిస్తాది.

## ఉన్నత మార్గము

పరిసయ్యుల నీతికంటె అధికమైన నీతి పరలోకమందు ధనము కూర్చుకొంటాది. అది జీవనసంబంధమైన విచారములచేతను, ధన భోగములచేతను అణచివేయబడదు. దేవునికేగాక సిరికికూడ దాసునిగా యుండగోరదు (మత్త 6:19-23). అది స్వనీతిపరులైన శాస్త్రులు పరిసయ్యులవలె మనుష్యులకు తీర్పుతీర్చదు. వారు మానవకల్పిత పారంపర్యాచారముల చొప్పున యితరులకు తీర్పుచ్చేవారు. అయితే అధికమైన నీతి సత్యానికి, అసత్యానికి భేదము తెలిసికొన్నట్టిది (మత్తయి 7:1-5).

పరిసయ్యుల నీతికంటె అధికమైన నీతి విచక్షణ జ్ఞానము గలిగినట్టిది. అది పరిశుద్ధమైన దాన్ని కుక్కలకు పెట్టదు. ముత్యములను పందుల యెదుట వేయదు (మత్తయి 7:6). కొందరు దేవుని వాక్యములోని ఐశ్వర్యాన్ని, మాధుర్యాన్ని హర్షించరు. దానిని బోధించేవారిని కూడ చులకనగా చూస్తారు. స్వనీతి వలన వారికి అట్టి మనస్తత్వం ఏర్పడతాది. "వారి జోలికిపోకుడి; వారు గ్రుడ్డివారైయుండి గ్రుడ్డివారికి త్రోవచూపువారు. గ్రుడ్డివాడు గ్రుడ్డివానికి త్రోవచూపిన యెడల వారిద్దరు గుంటలో పడుదురు" (మత్తయి 15:14). ఈ అధికమైన నీతికి ఒక బంగారు సూత్రమున్నది: "మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు

కోరుదురో మీరును వారికి చేయుడి" (మత్తయి 7:12). యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగ మంతయు, శాస్త్రులయొక్కయు, పరిసయ్యుల యొక్కయు స్వనీతిని ప్రక్కన బెట్టి దానిని అధిగమించిన అత్యుత్తమమైన నీతిని గూర్చి చెప్పినట్టిది. యేసుక్రీస్తు స్వయంగా తన జీవితంద్వారా ఈ మహోన్నతమైన మార్గాన్ని మనకు చూపించారు. ఆయనయందు విశ్వసించి, పాపముల విషయమై మారుమనస్సు బొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందిన యెడల ఈ నీతి మార్గంలో ఆయన నిన్ను పయనింపజేస్తాడు. ఆయనను వెంబడింప గోరుచున్నావా?

—జాషువా గూటం.

---

## దైవత్వము యొక్క సారాంశము

## (The Essence of Godhead)

పాతనిబంధన గ్రంధము చాలావరకు హెబ్రీ భాషలో వ్రాయబడినది. హెబ్రీ భాషలో దేవుని ఎలోయీము అని పిలిచేవారు. ఎలోయీము అను పదము దేవుడు అను పదమునకు బహువచనమై యున్నది. అయినను ఎలోయీము అను పదము ఒకరికంటే ఎక్కువమంది దేవుళ్ళు ఉన్నారు అని అర్థమిచ్చుటలేదు. కాని ఒకేఒక దేవుడున్నారు అని బైబిలు స్పష్టముగా చెప్పుచున్నది (ద్వితియో 6:4, యెషయ 44 : 6; 1 కొరింధి 8:4). అయినప్పటికి దైవత్వము (ఎలోయీము) యొక్క స్వభావము ఏక కాలంలో వేరువేరు వ్యక్తుల యొక్క సంపూర్ణాధికారము గల ఏకత్వమై యున్నది.

### తండ్రియైన దేవుడు

యేసుక్రీస్తు ఈ లోకములో యున్నపుడు ఆయన శిష్యులతో దేవుని ప్రార్థించునపుడు "మా తండ్రి" అని సంబోధించమని చెప్పెను

(మత్తయి 6:9). క్రీస్తు తానే అనేక సార్లు దేవునిని గూర్చి మాట్లాడు నపుడు తండ్రీ అని పలికెను (మత్తయి 11:25-27; యోహాను 6:27). ఎవరైతే ఆదియందు భూమ్యాకాశములను సృజించెనో ఆయనే దేవుడు (ఆది1:1). దేవుడు మనలను ఎంతో ప్రేమించి మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని ఆయన లోకమునకు పంపెను (1 యోహాను 4:10).

## కుమారుడైన దేవుడు

కుమారుడుకూడా దేవుడని బైబిలు బోధించుచున్నది. అనగా రెండవ దేవుడని కాదుగాని, త్రైవత్వములోని మరొక మూర్తిత్వమై యున్నాడు. "ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవునియొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగి యున్న దేదియు ఆయన లేకుండా కలుగలేదు". "ఆ వాక్యము శరీర ధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను. తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి. యోహాను 1:1-3 మరియు 14 గమనించండి. ఆ వాక్యము శరీరధారియై - అనగా మనుష్య కుమారుడు - ఆయనే దేవుడు-ఆయన మూలముగా సమస్తమును కలిగెను. బైబిలు గ్రంథము లోని మొదటి వచనము "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అని చెప్పుచున్నది.

క్రీస్తు చూపిన విధేయతను క్రైస్తవులుకూడా కలిగియుండాలని అపొస్తలుడైన పౌలు ఈ విధంగా చెప్పెను: "క్రీస్తు యేసునకు కలిగిన ఈ మనస్సును మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూప ముసు కలిగినవాడై యుండి దేవునితో సమానముగా ఉండుట విడిచి పెట్టకూడని భాగ్యమని ఎంచుకొనలేదు గాని మనుష్యుని పోలికగా

పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను" (ఫిలిప్పీ 2 : 5-7). మరియు రోమా 9 : 5 లో క్రీస్తుని గూర్చి ఈలాగు వ్రాయబడెను: "శరీరమును బట్టి క్రీస్తు వీరిలో పుట్టెను. గనుక ఈయన సర్వాధికారియై యుండి నిరంతరము స్తోత్రార్హుడై యున్నాడు ఆమేన్". మత్తయి 16:18 లో క్రీస్తు నా సంఘమును కట్టుదునని చేసిన వాగ్దానము అపొ. కా. 2 : 37-47 లో నెరవేరినది.

అపొస్తలుడైన పౌలు ఎఫెసులోని సంఘపు పెద్దలను కలుసుకొని ఈలాగు చెప్పెను. "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటలో పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందనుగూర్చియు, మీమట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (అపొ.కా. 20 : 28). క్రీస్తు తన సంఘమును కట్టుదునని చెప్పెను. మరియు పాపముల ప్రాయశ్చిత్తార్థమై సిలువలో తనరక్తమును చిందించి సంఘముకొరకు తన్ను తాను అప్పగించుకొనెను (ఎఫెసీ 5:25). క్రీస్తు తన స్వరక్తమిచ్చి సంపాదించిన దేవుని సంఘమును కాయుడని సంఘ పెద్దలను అపొస్తలులు ప్రోత్సహించిరి.

మరియు పరిశుద్ధాత్ముడు సంఘమును కాయుటకు వారికి అధిపతియైయున్నాడు. ఇక్కడ మనకు దైవత్వములోని మూడవ మూర్తిత్వము పరిచయమగుచున్నాడు. సంఘము అనగా దేవుని మందిరము (1 తిమో 3 : 15). దేవుడు ఆయన గృహమునకు యజమానుడైయున్నాడు. ఆయన గృహములో ఎవరినైనను నియమించుటకు అధికారము కలిగియున్నాడు. సంఘమును కాయుటకు పరిశుద్ధాత్ముడు పెద్దలను నియమించెను: అందుచేత పరిశుద్ధాత్ముడు కూడా దేవుడైయున్నాడు.

# త్రియేక దేవుడు

వాక్యమైన దేవుడు భూమిపైకి మానవునిగా వచ్చెను. ఆ సమయములో ఆయన పరిశుద్ధాత్మ శక్తి వలన కన్య మరియ యందు జన్మించెను. ఈ చక్కని, ఆశ్చర్యకరమైన దేవుని కుమారుని జన్మ వృత్తాంతమును మత్తయి 1, 2 అధ్యాయములు మరియు లూకా 2వ అధ్యాయములోను చూడగలము. ఇందు దైవత్వములోని మూర్తిత్వములు మానవుని రక్షణ సంకల్పములో ఏవిధంగా కలిసి పనిచేసారో చూడగలము. తండ్రి ఆ వాక్యమును లోకములోనికి పంపెను. కన్య మరియ పరిశుద్ధాత్మ వలన గర్భము ధరించి లోక రక్షకుడైన దేవుని కుమారునకు జన్మనిచ్చినది. ఈ విధముగా దైవత్వము లోని ముగ్గురు వ్యక్తులయొక్క సంపూర్ణ ఏకత్వమును మనము చూడగలము.

తరువాత క్రీస్తు బాప్తిస్మ సమయములో అనగా క్రీస్తు 30 సం॥ల వయస్సుగలవాడై యుండి తన పరిచర్య ప్రారంభించుటకు ముందు దైవత్వములోని ఆ ముగ్గురు వ్యక్తులు కలసి ప్రత్యక్షమైరి. "యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్ళలోనుండి ఒడ్డునకు వచ్చెను. ఇదిగో ఆకాశము తెరువబడెను. దేవుని ఆత్మ పావురమువలె దిగి తన మీదకు వచ్చుట చూచెను. మరియు - ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు ఈయన యందు నేనానందించుచున్నాను అని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను" (మత్తయి 3:16, 17).

దేవుడు - తండ్రి, వాక్యము కుమారుడు, పరిశుద్ధాత్మ - ఆదరణ కర్త (యోహాను 14:26; యోహాను 16:7). దైవత్వములోని ఈ ముగ్గురు వ్యక్తులు కూడా ఒకే సత్యదేవుడని తెలియుచున్నది (ఎలోహీము). ఆయనే భూమ్యాకాశములను సృజించినవాడు. మరియు మానవ రక్షణ సంకల్పాన్ని కలుగజేసినవాడు. రక్షణ సంకల్పమును నెరవేర్చుటలో వేరువేరు వ్యక్తులుగా వేరువేరు రీతులుగా పనిచేసిరి.

తండ్రి లోకములోని పాపుల ప్రాయశ్చిత్తార్థము వాక్యమును లేక కుమారుని ఈ లోకమునకు పంపెను. కుమారుడు మరణ, సమాధి, పునరుత్థానముల అనంతరము దేవుని మహిమ పరచుటకు దేవుని యొద్దకు చేర్చుకొనబడెను. సృష్టి ఆరంభములో ఆయన దేవునితో కూడా ఉన్నవాడు. మానవుల విమోచన నిమిత్తము తండ్రి పరిశుద్ధాత్మను పంపెను (యోహాను 14:25, 26, యోహాను 16:5-15, అపొ.కా. 1:1-8; 2:1-4).

దైవత్వములోని ముగ్గురు వ్యక్తులు ఒకే విధముగా యున్నారు. దేవుడు అన్నింటికంటె పైన ఉన్నవాడు. సువార్త ప్రకటన విషయములో క్రీస్తు శిష్యులకు ఇచ్చిన ఆజ్ఞను బట్టి మనము దైవత్వములోని సత్యమును అవగాహన చేసుకొనగలము: "అయితే యేసు వారి యొద్దకు వచ్చి - పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది. కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులుగా చేయుడి. తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి (నామములలోనికి కాదు) బాప్తిస్మమియ్యుడి" (మత్తయి 28:18, 19).

అపొస్తలుడైన పేతురు పెంతెకోస్తు దినమున సమస్త జనులనుద్దేశించి ఈ విధంగా పలికెను: "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ. కా. 2 : 38). క్రీస్తు నామమున అనగా క్రీస్తు నామమున మాత్రమునసేకాక తండ్రి నామమున మరియు పరిశుద్ధాత్మ నామమున లేక ఈ ముగ్గురి నామమున అని గ్రహింపవలెను.

## పరిశుద్ధాత్మ దేవుడు

అననీయ తన పొలమును అమ్మి భార్య ఎరుకనే వాడు దాని

వెలలో కొంత దాచుకొని, కొంత అపొస్తలులపాదములయొద్ద ఉంచెను. అప్పుడు పేతురు - "అననీయా, నీ భూమి వెలలో కొంత దాచుకొని పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను? అది నీ యొద్ద నున్నపుడు నీదే కదా? అమ్మిన పిమ్మట అది నీ వశమై యుండలేదా? యెందుకు ఈ సంగతి నీ హృదయములో ఉద్దేశించుకొన్నావు? నీవు మనుష్యులతో కాదు దేవునితోనే అబద్ధమాడితి వనెను" (అపొ. 5:3, 4).

పేతురు పలికిన సత్యమును గమనించండి: "నీవు పరిశుద్ధాత్మతో అబద్ధమాడితివి. మరియు "నీ దేవునితో" అబద్ధమాడితివి అనగా పరిశుద్ధాత్మను మోసపుచ్చుటద్వారా అననీయ దేవునితో అబద్ధమాడెను. ఎందుకనగా పరిశుద్ధాత్ముడు దేవుడై యున్నాడు.

యేసుక్రీస్తు యోహానుకు ప్రత్యక్ష పరచుకొని ఇట్లు చెప్పెను: "అల్ఫయు ఒమేగయు నేనే. వర్తమాన భూతభవిష్యత్ కాలములో ఉండువాడను నేనే అని సర్వాధికారియైన ప్రభువు సెలవిచ్చుచున్నాడు" (ప్రకటన 1 : 8). సుమారు క్రీస్తు పూర్వము 800 సం|| క్రితం యెషయా తన గ్రంథములో ఈలాగు చెప్పియున్నాడు. "ఇశ్రాయేలీయుల రాజైన యెహోవా వారి విమోచకుడైన సైన్యముల కధిపతియగు యెహోవా ఈ లాగు సెలవిచ్చుచున్నాడు: నేను మొదటివాడను కడపటివాడను. నేను తప్ప ఏ దేవుడును లేడు" (యెష 44:6).

ఒకేఒక దేవుడు. ఆయనే తండ్రి కుమార పరిశుద్ధాత్మ: మనము కుమారుడు చెప్పిన విధముగా చేయుటవల్ల తండ్రియొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు చిత్తమును నెరవేర్చినవార మగుదుము. ఒకరు చెప్పిన దానిని విని ఆ ప్రకారము చేయుటవల్ల ఈ ముగ్గురు చెప్పినది విని చేయునట్లగును. ఈ ముగ్గురిలో ఒకరు చెప్పినది తిరస్కరించిన యెడల దేవుడు చెప్పినదానిని తిరస్కరించినవార మగుదుము.

—సన్నీ డేవిడ్, న్యూఢిల్లీ (VOT).

# నీవు దేవుని సన్నిధిని కనబడితివా ?

## ( Have you met your God )

ఆమోసు గ్రంథము ఆశ్చర్యకరమైన విషయమును తెలియజేయుచున్నది. ఈ పుస్తక భాగము ఇశ్రాయేలీయులను గద్దిస్తూ వ్రాయబడినది, భూమిపై నున్న జనులలో దేవునితో ఎక్కువ పరిచయము కలిగిన వారెవరనగా యూదులు మరియు ఇశ్రాయేలీయులే అయినప్పటికి ఇశ్రాయేలీయులను ఉద్దేశించి దేవుడు ఈలాగున చెప్పుచున్నాడు. "ఇశ్రాయేలీయులారా, మీ దేవుని సన్నిధిని కనబడుటకై సిద్ధపడుడి" (ఆమోసు 4 : 12).

ఆమోసు గ్రంథమునందలి విషయములను పరిశీలించగా ఇశ్రాయేలీయులు "దేవుడు ఎవరు?" అనేది నిజముగా గ్రహించలేదని స్పష్టమగుచున్నది. నిజానికి ఆయన ఇశ్రాయేలీయులను అనేకసార్లు శత్రువుల బారినుండి విడుదలజేసి, అమితమైన విశ్రాంతిని కలుగజేసినప్పటికి ఆయనను గూర్చి కొంచెమైనను ఆలోచనలేకుండిరి.

ఆమోసు గ్రంథము వ్రాయబడినప్పటికి ఇశ్రాయేలీ జనాంగము చాలా గొప్పగా వర్ధిల్లుచుండెను. అయినప్పటికి ముప్పైమూడు సంవత్సరములలో అష్షూరీయులు వారిపైబడి వారిని నాశనము చేసిరి.

లోతులేని వారి దైవ జ్ఞానము అనుభవములేని ఆచారములతో ఆరాధించుటకు వారిని నడిపించినది. నిశ్చయముగా ఆయన వారిని చూడడు లేక గమనించడు అని అనుకొని వారు బీదలైనవారిని క్రూరముగా అణగద్రొక్కిరి. అది వారియొక్క కాఠిన్యతను బయలుపరచుచున్నది. వారు బహిరంగముగా విగ్రహారాధనను అభ్యసించిరి. మరియు వారి క్రియలను దేవుడు లెక్కింపడు అనుకొని వారు గర్వముతో ఇష్టపూర్వకముగా దేవుని శాసనములపట్ల అవిధేయతను చూపిరి.

దేవునిపట్ల వారి ఆలోచనలు ఏమయినప్పటికి, వారి యెడల ఆయన చేయు ఆరోపణలు, వారి క్రియలపట్ల ఆయనకుగల ఆసక్తి విషయములో వారి ఉద్దేశములు ఎలాగున్నప్పటికి దేవుడు వారి యెడల ప్రత్యేక మనస్సును కల్గియున్నాడు.

ఆవశ్యముగా ఆయన వారితో ఈలాగు చెప్పుచున్నాడు. "నేను ఎవరిని, మరియు నేను ఏమై యున్నాను అని మీరు ఎరిగియున్నారని మీరు తలంచుచున్నారు కాని నేను నిజముగా ఎమైయున్నానో నాకు నేనుగా పరిచయము చేసుకోనియ్యుడి".

దేవుడు అనగా ఎవరు మరియు ఆయన ఏమైయున్నాడు అను టలో నీయొక్క అభిప్రాయము ఏమైనప్పటికి నీవు ఎన్నటికిని నిజముగా ఆయన సన్నిధిలో కనబడుట సాధ్యమా?

— J.K.W. కార్టర్ (VOT)

— o —

## సంఘములో స్త్రీ పాత్ర

## (Women's Place in the Church)

క్రైస్తవు లందరికిని బైబిలు ఆదేశముల నిచ్చుచున్నది. ప్రభువు సంఘములో స్త్రీలు చేయకూడనివి కొన్ని గలవు. మరియు కొన్ని సంగతులు చేయవలెనని ఆజ్ఞాపింపబడితిరి.

### స్త్రీ చేయదగనివి ఏవి?

సంఘ పెద్ద మరియు పరిచారకుని విధులు స్త్రీ నిర్వహించ కూడదు. ఈ పదవులను అర్హతలు గల పురుషులు మాత్రమే నిర్వహించవలెనని లేఖనములు స్పష్టముగా బోధించుచున్నవి (1 తిమో 3:1-13, తీతు 1:5, 6). సంఘ సమావేశములలో స్త్రీ బోధకురాలిగా

గాని, సువార్తికురాలిగా గాని ఉండరాదు. క్రైస్తవులైన పురుషులు వున్న సమయములో పురుషులు మాత్రమే ఉపదేశించుటకు అధికారము గలదు. స్త్రీలు మౌనముగా ఉండవలసినదేగాని పురుషుని అధికారమును భంగపరచ ప్రయత్నము చేయరాదు. "స్త్రీలు మౌనముగా ఉండి, సంపూర్ణ విధేయతతో నేర్చుకొనవలయును. స్త్రీ మౌనముగా ఉండవలసినదేగాని ఉపదేశించుటకైనను, పురుషునిమీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవీయను" (1 తిమో 2:11, 12).

## స్త్రీ చేయదగినవి ఏవి ?

క్రైస్తవ స్త్రీలు స్త్రీలకు బోధించుచూ మంచి మాదిరి కనబరచవలెనని బోధింపబడుచున్నారు. అపొస్తలుడైన పౌలు తీతుకు వ్రాస్తూ "అలాగుననే వృద్ధ స్త్రీలు కొండెకత్తెలును, మిగుల మద్యపానాసక్తులునై యుండక ప్రవర్తన యందు భయభక్తులు గలవారై యుండవలెననియు, దేవుని వాక్యము దూషింపబడకుండునట్లు యౌవన స్త్రీలు తమ భర్తలకు లోబడి యుండి తమ భర్తలను, శిశువులను ప్రేమించువారును స్వస్థబుద్ధి గలవారును పవిత్రులును ఇంట వుండి పనిచేసికొనువారును మంచివారునై యుండవలెనని బుద్ధిచెప్పుచు మంచి ఉపదేశము చేయువారునై యుండవలెననియు బోధింపుము" (తీతు 2 : 3-5). క్రైస్తవ స్త్రీ తాను చేయు సత్క్రియలు అనగా పిల్లలను పెంచుట, ఆతిథ్యమిచ్చుట, ఇతరులకు సహాయము చేయుట మొదలగు సత్క్రియల వలన గుర్తింపు నొందును (1 తిమో 5:10).

క్రైస్తవు లందరికీ ఇయ్యబడిన ఆజ్ఞ లన్నింటికి స్త్రీలు కూడ విధేయులై యుండవలెను. ఇందులో కొన్ని ఆజ్ఞ లేమనగా - పాడుట (ఎఫెసీ 5:10) ప్రార్థించుట (1 థెస్స 5:17, 18) మరియు సంతోషముగా కానుకలిచ్చుట (2 కొరి 3 : 7).

క్రైస్తవ స్త్రీలు సంఘ కార్యక్రమములలో పాల్గొనుట ప్రాముఖ్యమైనది. కాని వారు లేఖనముల పరిధిలోనే పనిచేయుట అతి ప్రాముఖ్యమైనది.

## ఆతిథ్యము - క్రైస్తవ పరిచర్యలో ఒక్కటి

క్రైస్తవ స్త్రీలమైన మనము దేవుని సేవించుటకు అనుమతించబడిన విధానములలో పరిమితి చేయబడితిమని కొన్నిసార్లు తలంచుదుము. ఆరాధనలో పురుషు లున్నపుడు స్త్రీలమైన మనము ప్రార్థనలు, వాక్య పరిచర్య, తదుపరి కార్యక్రమములు నడుపుటకు అనుమతింపబడలేదు (1 తిమోతి 2:11, 12; 1 కొరి 14:34). కానీ, ఆతిథ్య విషయములో మనము గొప్ప సేవ చేయుటకు అనుమతి గలవారము. ఏలయనగా క్రైస్తవులు ఆతిథ్యమివ్వ ఆజ్ఞను పొందితిరని రోమా 12:10, 13లో చూడగలము. "సహోదర ప్రేమ విషయములో ఒకని యందొకరు అనురాగము గలవారై ... పరిశుద్ధుల అవసరములలో పాలు పొందుచూ శ్రద్ధగా ఆతిథ్యము ఇచ్చుచుండుడి". అవసరములో నున్న క్రైస్తవులతో మన ఆహారము, నివాసమును పంచుకొనుట వలన అట్టి వారికి సహాయముచేయు అవకాశమును పొందియుందుము. దేవుని వాక్యమును బోధించు బోధకులకు మరియు ఉపదేశకులకు మనము ఆతిథ్యము ఇచ్చుటవలన క్రీస్తు సువార్త వ్యాప్తిలో ముఖ్య పాత్రను కలిగినవారమై యుందము (మత్తయి 10 : 41). మనము ఎరిగిన వారికికూడా ఆతిథ్య మియ్యవలెను. అయితే అబద్ధ బోధకుల పనిలో మనము వారికి ఆతిథ్య మియ్యకుండ జాగ్రత్తపడవలెనని 2 యోహాను 10, 11 వచనములలో హెచ్చరింపబడితిమి. "ఎవడైనను ఈ బోధను తేక మీ యింటికి వచ్చిన యెడల వానిని మీ యింట చేర్చుకొనవద్దు; శుభమని వానితో చెప్పను వద్దు, శుభమని వానితో చెప్పువాడు వాని దుష్క్రియలలో పాలివాడగును". మనము సహో

దరులకు సహాయం చేయుట మరియు ఆతిథ్యమిచ్చుట అనునవి తనకే చేసినట్లని మత్తయి 25:35-40లో యేసు చెప్పెను. ఆతిథ్యమిచ్చి సేవ చేయుటద్వారా "నా తండ్రిచేత ఆశీర్వదింపబడిన వారలారా! రండి, లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడని" మత్తయి 25:34లో చెప్పబడు సమూహములో నుందుము. "కాబట్టి మనకు సమయము దొరికినకొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరినవారి యెడలను మేలు చేయుదము" (గలతీ 6:10). —సుజీ ఫ్రెడరిక్.

---

## సహోదరుల ఐక్యత

## (Unity of the Brethren)

ఐక్యత అను పదము బైబిలు గ్రంథమందు మూడుసార్లు కనబడును (కీర్తనలు 133:1, ఎఫెసీ 4:13, 4:1). ఐక్యత కలిగి ఉండాలను భావముగల వాక్యము లనేకములు గలవు. సంఘములోని సభ్యులందరు సహోదరులు, సహోదరుల ఐక్యతను గూర్చి దావీదురాజు చక్కగా వర్ణించాడు. "సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము! అది తలమీద పోయబడి అహరోను గడ్డము మీదుగా పారి అతని అంగీల అంచు వరకు దిగజారిన పరిమళ తైలమువలె నుండును. సీయోను కొండలమీదికి దిగి వచ్చు హెర్మోను మంచువలె నుండును. ఆశీర్వాదమును శాశ్వత జీవమును అచ్చట నుండవలెనని యెహోవా సెలవిచ్చి యున్నాడు" (కీర్త 133). సంఘ సభ్యు లందరును ఇట్టి ఐక్యతను కలిగి నివసించాలి. ఆ ఐక్యత ఎంతో మేలు, మనోహరము, పరిమళ తైలము మరియు ఆశీర్వాదమును శాశ్వత జీవమును అచ్చట నుండెనని యెహోవా సెలవిచ్చి యున్నాడు.

## ఐక్యత కొరకు క్రీస్తు ప్రార్థన

సహోదరుల ఐక్యత యొక్క ప్రాముఖ్యతను గూర్చి క్రొత్త నిబంధన ఏమి బోధించుచున్నదో గమనించుదము: విశ్వాసు లందరి ఐక్యత కొరకు యేసుక్రీస్తు ప్రార్థించాడు. "వారి వాక్యము వలన నా యందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారి కొరకు ప్రార్థించుచున్నాను" (యోహాను 17 : 21). వారందరును ఒకే విషయమును వినుటవలన (బోధింపబడుట వలన) విశ్వసించగలరు. ఆ బోధ అపొస్తలుల బోధ (యోహాను 20:31; రోమా 10:14-17).

"తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున" (వ 21) మరియు "నన్ను చూచినవాడు తండ్రిని చూచి యున్నాడు" (యోహాను 14:19) అని తండ్రి కుమారుల ఐక్యతను గూర్చి యేసు పల్కినటువంటి ఐక్యత ప్రతి స్థానిక సంఘములోని సహోదరుల మధ్య ఉండాలి. క్రైస్తవుల ఐక్యతను చూచిన లోకము యేసునందు విశ్వసించవలెనని యేసుప్రభువు కోరుచున్నాడు. సహోదరుల ఐక్యత యొక్క శక్తి మరియు ఉద్దేశము-లోకము యేసుప్రభువు దేవుని కుమారుడని నమ్మాలి (యోహాను 17:20). ఇట్టి ఐక్యత మొదటి శతాబ్దములోని క్రీస్తు సంఘములో ఉండినట్లు క్రొత్త నిబంధనలో చదువగలము (అపొ.కా. 2:44, 45; 4:32-35).

### అపొస్తలుల విజ్ఞాపన

సహోదరులు ఐక్యత కలిగి వుండాలని అపొస్తలుడైన పౌలు కూడా వేడుకొన్నాడు. "సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక, యేకమనస్సుతోను ఏక తాత్పర్యముతోను, మీరు సన్నద్ధులై యుండవలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను" (1 కొరింథీ 1 : 10).

కొరింథులోనున్న సంఘములో కలహము లుండెను (1 కొరింథీ 1 : 11). వారు మనుష్యుల పేరులను ధరించి యుండిరి. ఒకడు నేను పౌలువాడను, ఒకడు నేను అపొల్లోవాడను, మరియొకడు నేను కేఫావాడను..." అని చెప్పుకొనుచుండిరి (వ. 12). పౌలు ఈ విభజనలను ఖండించి, ఐక్యత కొరకు వేడుకొన్నాడు. మానవ పేర్లను ధరించుట కొరింథులోనున్న క్రైస్తవులకు తప్పు అని పౌలు చెప్పాడు కనుక నేడు మనముకూడా అట్టి పేర్లను ధరించుట తప్పు. క్రైస్తవులేమి చేసినను సమస్తమును యేసుక్రీస్తు పేరట చేయాలి (కొలస్సయి 3:17). మాటచేతగాని, క్రియచేతగాని మనము చేయున వన్నియు క్రీస్తు అధికారమునకు అనుకూలముగా ఉండాలి. దేవుడు కోరిన ఐక్యత కలిగియుండుటకు అందరు ఒకే బోధను బోధించాలి, పాటించాలి. "ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించునట్టు బోధింపవలెను" (1 పేతురు 4 : 11). అందరు ఒకే సువార్తను బోధించాలి (గలతీ 1:6-11). ఈ ఒకే బోధను బోధిస్తే విభజనలుండవు.

## ఏకత్వానికొక సూత్రము

సహోదరుల ఐక్యతను భంగపర్చే క్రూరమైన తోడేళ్లు వంకర మాటలు పలుకు మనుష్యులు బయలుదేరుదురని మొదటి శతాబ్దము లోని విశ్వాసులు హెచ్చరింపబడిరి (అపొ.కా. 20 : 29). ఐక్యతకు భంగము వాటిల్లుతుందని సిద్ధాంతపరమైన విషయాల్లో అసత్యముతో రాజీపడకూడదు. ఐక్యత కలిగియుండుటకై దేవుడేర్పాటు చేసిన నియమములను ఎఫెసీ 4:4-6లో చదువగలము:

శరీర మొక్కటే, ఆత్మయు ఒక్కడే. ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మ మొక్కటే. అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఈ వాక్యములో ఏడు ఏక విషయాలను

బైబిలు బోధించుచున్నది. ఇవి సంఘ నిర్మాణములో, పరిశుద్ధాత్మ ద్వారా బయలుపర్చబడిన లేఖనములు భక్తికిని, జీవమునకును కావలసిన విషయాలలో, క్రైస్తవుల గురి, గమ్యము విషయంలో, అధికారములో, సిద్ధాంతములో, విధేయతలో, ఆరాధనలో ఐక్యతనుగూర్చి బోధించుచున్నవి. వీటిలో ఏఒక్క దానిని మీరినను ఐక్యతను భంగపర్చి ప్రభువు ఉద్దేశాన్ని తృణీకరించినట్లగును.

నేటి క్రైస్తవ్యములో ఈ ఐక్యత లోపించుట వలన ప్రపంచ క్రైస్తవ వ్యవస్థ అనేక మతశాఖలుగా చీలిపోయి చిన్నాభిన్నమై, లోకము యేసుక్రీస్తు నిజమైన దేవుని కుమారుడని నమ్మకుండుటకు కారణమగుచున్నది. అందువలన ఐక్యతనుండి తొలగిపోయి మనుష్యులేర్పరచిన గుంపులలోనున్నారు. వారు పరీక్షించుకొని బైబిలు నొద్దకు తిరిగి రావలెనని మనవి చేయుచున్నాము. దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘము (ఒకే సంఘము) నందుండి, పరిశుద్ధాత్మ ద్వార పలుకబడిన బైబిలు గ్రంథమునే అనుసరించుచు, క్రీస్తునందు ఒకే నిరీక్షణ కలిగి, క్రీస్తు అధికారము (ఒకే ప్రభువు) నకు లోబడుచు, క్రీస్తులో నిత్యజీవము (ఒకే విశ్వాసం) కలిగియుండుటకు, ఆయన ఆజ్ఞ (ఒకే బాప్తిస్మము మార్కు 16:16, అపొ.కా. 2:38)కు విధేయత చూపి, ఆత్మతోను, సత్యముతోను ఒకే దేవునిని ఆరాధించుటకు పూనుకోవాలి. అప్పుడే దేవుని చిత్తము జరిగించుచు, ఆయన కోరిన ఐక్యత కలిగి నివసించగలము. ఆశీర్వాదమును, శాశ్వత జీవనమును పొందగలము. — వి.జె. బెన్‌సన్, హైదరాబాదు.

---

## వేరుచేయబడిన శరీరాలు, శిరస్సులు !

## (Heads and Bodies Seperated)

శరీరమునుండి వేరుచేయబడిన శిరస్సుగాని, శిరస్సునుండి వేరుచేయబడిన శరీరముగాని ఇటు అటు తిరుగుట నీవెన్నడైనా చూచావా?

మానవుల శరీరాలనుండి శిరస్సులు వేరుచేయబడితే శరీరాలు బ్రదుకవు, శిరస్సులు బ్రదుకవు. యేసుక్రీస్తు తన శరీరమైన సంఘమునకు శిరస్సై యున్నాడని క్రొత్తనిబంధన బోధించుచున్నది. క్రీస్తు సంఘములో లేకుండా క్రీస్తును కలిగియున్నామని చెప్పుకొనేవారున్నారు. గాని అది అసంభవము. ఏలయనగా క్రీస్తును కలిగి యున్నవాడు ఆయన సంఘాన్ని కూడ కలిగియుంటాడు. అతడాయన సంఘములో యుండి దానికి శిరస్సయిన క్రీస్తును ఘనపరుస్తాడు (కొలస్స 1 : 18). క్రీస్తు సంఘమును గూర్చి బోధించనివాడు నిజమైన క్రీస్తును గూర్చి బోధించ లేడు.

ఒకడు క్రీస్తు ప్రేమను గూర్చి బోధిస్తే, క్రీస్తు సంఘమును ప్రేమించి దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెనని బోధించాలి (ఎఫెసీ 5:25). క్రీస్తు రక్షకుడని బోధిస్తే క్రీస్తు తన శరీరమైన సంఘమునకు రక్షకుడని బోధించాలి (ఎఫెసీ 5:23). ఒకడు క్రీస్తు రక్తమును గూర్చి బోధిస్తే, క్రీస్తు తన స్వరక్తమిచ్చి తన సంఘమును కొనెనని బోధించాలి (అపొ. కా. 20 : 28). ఒకడు క్రీస్తు రాజై యున్నాడని బోధిస్తే, ఆయన తన రాజ్యమైన సంఘముపై రాజై యున్నాడని బోధించాలి (కొలస్స 1:13, 13; 3 : 15).

ఎవడైనను క్రీస్తును గూర్చి నిజంగా ప్రకటించునప్పుడు ఆయన సంఘమునుగూర్చి ప్రకటించకుండా యుండలేడు. అట్లే ఎవడైనను సరే క్రీస్తు సంఘములో లేకుండా క్రీస్తులో యుండలేడు! మరల ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందితేనే గాని ఆయన శరీరములో యుండలేడు. క్రీస్తు నామమును ధరించని సంఘములో యున్నవాడు నిర్జీవమైన మానవకల్పిత శరీరములో యున్నవాడే (రోమా 6:3, 4, గలతీ 3 : 27).

—బేసిల్ ఓవర్టన్ (VOT)

— o —

(టైటిల్ 2వ పేజీ తరువాయి)

ఫిబ్రవరి 11వ తేదీ శనివారం కాకినాడ శివారులోని రాయుడు పాలెంలో గొప్ప బహిరంగ సువార్త కూటము జరిగెను. దీనికి పెద్దకాపు అనబడే ఫ్రెన్సిస్‌గారు చుక్కా అప్పారావుగారు సారథ్యము వహించి ఘనముగా నిర్వహించిరి. సోదరులు D. ఇశ్రాయేలురాజు, P. చంద్రశేఖర్, జాషువాగూటం, K. శాంతారావ్, G. ఫిలిప్స్, నెహెమ్యాగూటంగార్లు వాక్యపరిచర్య చేసిరి.

ఫిబ్రవరి 24న కాకినాడ సత్యవాణి భవనంలో ఏర్పాటు చేయబడిన సువార్తికుల సదస్సులో 270 మంది పాల్గొనిరి. ఆ సదస్సులో అమెరికా నుండి వచ్చిన సోదరులు ఫిల్ యంగ్‌గారు, మైక్ ఫ్రేడర్‌గారు వాక్యపరిచర్య చేసిరి. సంఘములో స్త్రీల యొక్క ప్రాధాన్యతను గూర్చి యంగ్‌గారు చక్కని హెచ్చరికల నిచ్చిరి. గృహములోను, సంఘములోను స్త్రీ నిర్వహించే పాత్ర అత్యంత ప్రాధాన్యమైనదని, గాని అనేకసార్లు ఆమెను మనం నిర్లక్ష్యం చేయుట జరుగుచున్నదని, అది విచారకరమని ఫిల్ యంగ్‌గారు బోధించారు. మైక్ ఫ్రేడర్‌గారు పరిశుద్ధాత్మను గూర్చిన వివిధ అంశములను ఉపదేశించారు. పరిశుద్ధాత్ముడు ఒక వ్యక్తియని, ఆయన ఒక శక్తి కాదని, అది యిది కాదని దైవత్వంలో తండ్రి కుమారులవలె పరిశుద్ధాత్ముడు కూడ భాగమైయున్నాడని ఆయన బోధించారు. మరియు మానవ చరిత్రారంభములో ప్రతి యుగములోను ఆయన అద్భుతములు చేసాడని, ఇప్పుడైతే అద్భుత వరములు ఎవరికి లేవని, ఉన్నాయని అనుకొనేవారు కేవలం భ్రమపడుచున్నారని చెప్పుచు ఆయన అనేక లేఖనాధారముల నిచ్చి నిరూపించారు. మార్చి నెల సువార్తికుల సదస్సు 21వ తేదీ మంగళవారం నాడు పెద్దాపురంలో Bro. T. జాన్ ఫ్రెడరిక్ గారి ఆధ్వర్యంలో జరుగును.

— 0 —

# క్రైస్తవ కీర్తనలు

236 పాటలు గల క్రైస్తవ కీర్తనల పుస్తకం మరల ముద్రింపబడినది. దానిలో అనేక క్రొత్త పాటలు, సత్యవాణిలో ప్రసారము చేయబడుచున్న పాటలు చేర్చబడినవి. ఒక్కొక్క కాపీ వెల రూ॥ 12/– మాత్రమే. పోస్టేజీ ఇంకొక రెండు రూపాయలు. వలయువారు ఈ దిగువ చిరునామాకు రూ॥ 14/–లు M. O. చేసి పొందండి :

**SATYAVANI,**
**Samba Murthy Street,**
**Kakinada - 533 004.**


**Regd. No. H/KD—45/KD H.O**
Date of Posting : 15th of Every month



**From**
**S A T Y A V A K K U**
**P.O. Box 80**
**KAKINADA 533 001**


**No.**

**To**

........................................

........................................

........................................

........................................